




# నవతరం

హైదరాబాద్ | సోమవారం, జూన్ 1, 2026 | సంపుటి:13 | సంచిక :7 | పేజీలు:4 | వెల:5


## అశ్వారావుపేటలో 'చీకటి' రాజ్యం..

# పాలకులు మారినా మారని రాత!

- శంకుస్థాపనలకే పరిమితమైన సెంట్రల్ లైటింగ్
- డ్రైనేజీలపై వ్యాపార విస్తరణతో పెరుగుతున్న ఇబ్బందులు
- ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలపై ప్రజల్లో అసంతృప్తి
- మున్సిపాలిటీగా మారినా తప్పని అస్తవ్యస్త తిప్పలు
- బుధవారం సంతే కాదు నిత్యం రోడ్లపైనే వ్యాపారాలు
- అస్సలు మున్సిపల్ వ్యవస్థకు ఈ విషయం తెలుసా? కావాలనే మౌనం వహిస్తుందా?




**అశ్వారావుపేటలో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తికాకపోవడం, డ్రైనేజీల పైన వ్యాపార విస్తరణ పెరగడం, రహదారులపై వాహనాల పార్కింగ్ కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తడం వంటి అంశాలపై స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ పట్టణంలోని పలు మౌలిక సమస్యలు ఇంకా పరిష్కారం కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ లైటింగ్ పనులను పూర్తి చేయడంతో పాటు డ్రైనేజీల వద్ద ఏర్పడిన ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు**


**నవతరం ప్రతినిధి,**
**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**


నాయకులు మారుతున్నారు.. ప్రభుత్వాలు మారుతున్నాయి.. పంచాయతీ కాస్త మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది.. కానీ అశ్వారావుపేట పట్టణ తలరాత మాత్రం మారడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పుడో గత బీఆర్ఎస్ (టీఆర్ఎస్) ప్రభుత్వ హయాంలో, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చేతుల మీదుగా వైభవంగా శంకుస్థాపన నోచుకున్న 'సెంట్రల్ లైటింగ్' ప్రాజెక్ట్ నేటికీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, ప్రస్తుత ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో పాలన సాగుతున్నా.. ఈ పనులు ఇంకా పూర్తి కాలేదని ప్రజలు చెబుతున్నారు. పట్టణమంతా రాత్రి వేళల్లో తగినంత వెలుతురు లేకపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారులపై ప్రయాణించే వారు మరింత మెరుగైన లైటింగ్ సదుపాయాలు అవసరమని అభిప్రాయపడుతున్నారు.

**పాదచారుల నడక దారులు (ఫుట్‌పాత్‌లు) మాయం.. డ్రైనేజీలపైనే వ్యాపార విస్తరణ**

సాధారణంగా ఏ పట్టణంలోనైనా డ్రైనేజీలపై ఉండే స్థలాన్ని బాటసారులు నడిచేందుకు (ఫుట్‌పాత్‌గా) ఉపయోగిస్తారు. కానీ అశ్వారావుపేటలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోందని

(మిగతా 2వ పేజీలో)









## అమరావతి అర్బన్ మొబిలిటీ ప్లానింగ్‌పై

# సీఎం చంద్రబాబు ఫోకస్

- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 61వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం
- భవిష్యత్ ప్రణాళికలపై చర్చ.. మొత్తం 18 ప్రతిపాదనలకు ఆమోదం
- హైకోర్టు భవనాల వద్ద రూ.547 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన
- అమరావతికి సొంత అగ్నిమాపక విభాగం, బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- 9 జిల్లాలను కలుపుతూ అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి ప్రణాళిక

అమరావతి రాజధాని నిర్మాణ పనుల్లో వేగం పెంచే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శనివారం ఆయన అధ్యక్షతన జరిగిన 61వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో 18 కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాజధానిలో పటిష్టమైన అర్బన్ మొబిలిటీ ప్లానింగ్ ఉండాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో భాగంగా, హైకోర్టు భవనాలకు సంబంధించి వివిధ మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.547.07 కోట్లు కేటాయించడానికి అథారిటీ ఆమోదం తెలిపింది. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు పీపీపీ పద్ధతిలో జెయింట్ అబ్జర్వేషన్ వీల్ నిర్మాణానికి, భవన నిర్మాణ వివాదాల సత్వర పరిష్కారానికి ప్రత్యేక బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో పాటు, అమరావతిలో సమర్థవంతమైన అగ్నిమాపక నియంత్రణ కోసం సీఆర్డీఏకు సొంత ఫైర్ వింగ్ ఏర్పాటు చేసుకునేందుకు అంగీకరించారు. ఏలూరు నుంచి ప్రకాశం వరకు 9 జిల్లాలకు విస్తరించే అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు కూడా అంగీకారం తెలిపారు. రాజధానిలోని అన్ని భవనాలకు సెంట్రల్ కూలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ప్రతి టౌన్‌షిప్‌లో ఆర్థిక కార్యకలాపాలు ఉండేలా చూడాలని సీఎం సూచించారు. వీటితో పాటు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, ఎల్పీఎస్ లేఅవుట్లలో ఏటీఎంల ఏర్పాటు, 495 మంది రైతులకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు వంటి

(మిగతా 2వ పేజీలో)

## జెన్ జీ ఆశయాలకు అనుగుణంగా

# 'సేనా గళం' ఏర్పాటు: పవన్ కల్యాణ్

- 'సేనా గళం' పేరుతో కొత్త కమిటీని ప్రకటించిన పవన్ కల్యాణ్
- పాత పద్ధతులకు స్వస్తి పలుకుతూ జనసేన కీలక నిర్ణయం
- ముల్లును ముల్లుతో తీసే ధోరణిని తోసిపుచ్చిన జనసేనాని
- వ్యక్తిగత తప్పులకు కులాలను ఆపాదించవద్దని స్పష్టం
- సామాజిక సామరస్యం, బాధ్యతాయుత రాజకీయాలే లక్ష్యం

జనసేన పార్టీలో సరికొత్త అధ్యాయానికి ఉప ముఖ్యమంత్రి, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. సామాజిక సామరస్యం, బాధ్యతాయుత రాజకీయాలు, రాజ్యాంగ విలువల పరిరక్షణ... ముఖ్యంగా జెన్ జీ యువత ఆశయాలకు అనుగుణంగా గళం వినిపించడమే లక్ష్యంగా 'సేనా గళం' అనే కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. కుల, మత రాజకీయాలతో సమాజాన్ని విభజించే ధోరణులకు వ్యతిరేకంగా ఈ కమిటీ పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. 'ముల్లును ముల్లుతోనే తీయాలి' అనే పాతకాలపు, బూర్జువా రాజకీయ ధోరణులకు జనసేన చరమగీతం పాడుతుందని తేల్చిచెప్పారు. ఒక కులం వారు విమర్శిస్తే, అదే కులం వారితో బదులిప్పించే పద్ధతిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి బూజుపట్టిన విధానాలకు తిలోదకాలిచ్చి, అభ్యుదయ భావాలతో ముందుకు సాగాలన్నదే జనసేన ఉద్దేశమని వివరించారు. సమకాలీన రాజకీయాల్లో కొందరు వ్యక్తులు తాము చేసే తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కులం, మతం, ప్రాంతం వంటి సున్నితమైన అంశాల ముసుగు వేసుకుంటున్నారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిగత తప్పిదాలకు సామాజిక వర్గాలను బాధ్యుల్ని చేస్తూ సమాజంలో విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, ఈ తరహా రాజకీయాలను నేటి యువత (జెన్–జీ) తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. 'సేనా గళం' కమిటీ.. రాజ్యాంగ విలువలకు కట్టుబడి, దేశ సమగ్రతకు భంగం కలగకుండా పనిచేస్తుందని తెలిపారు. ముఖ్యంగా యువత ఆశయాలకు అనుగుణంగా గళం వినిపిస్తుందని దిశానిర్దేశం చేశారు. వ్యక్తిగత తప్పులను వ్యక్తిగత స్థాయిలోనే ప్రశ్నించాలి తప్ప, ఆ వ్యవహారంలోకి కులాలను, మతాలను లాగకూడదనేది జనసేన పార్టీ స్పష్టమైన విధానమని పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు.



# అశ్వారావుపేటలో 'చీకటి' రాజ్యం..

# పాలకులు మారినా మారని రాత!

స్థానికులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో దుకాణదారులు తమ వ్యాపార సరుకులను, సామాన్లను డ్రైనేజీల పైన, పక్కన ఉంచడంతో పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. దీంతో కొన్నిచోట్ల ప్రజలు రోడ్డుపైనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆ దుకాణాలే శాశ్వత విస్తరణలుగా మారిన వైనం అశ్వరావుపేట లో కనిపిస్తోంది.**

వారానికి ఒక్కసారి బుధవారం జరిగే సంత కోసం వచ్చే చిరు వ్యాపారులు రోడ్ల పక్కన దుకాణాలు ఏర్పాటు చేయడం ఒక ఎత్తయితే.. కొన్ని ప్రాంతాల్లో శాశ్వత దుకాణాల పరిధి డ్రైనేజీల వరకు విస్తరించిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల కారణంగా పట్టణంలో రాకపోకలు, పారిశుధ్య నిర్వహణపై ప్రభావం పడుతోందని స్థానికులు చెబుతున్నారు.

ఈ పరిస్థితులను గమనిస్తున్న ప్రజలు, అసలు పట్టణంలో మున్సిపల్ నిబంధనల అమలు ఎంతవరకు జరుగుతోందనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. సమస్యలు కనిపిస్తున్నప్పటికీ వాటి పరిష్కారంలో వేగం కనిపించడం లేదని అభిప్రాయపడుతున్నారు.

నియమ నిబంధనలు గాలికా?.. నడిరోడ్డుపైనే వాహనాల పార్కింగ్

పట్టణంలో రోడ్డుకు మధ్యన ఏర్పాటు చేసిన డివైడర్లు, డ్రైనేజీల పరిస్థితి చూస్తే రహదారి నిర్వహణపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. డ్రైనేజీలను ఆనుకుని విస్తరించిన దుకాణాలు, రోడ్డుకు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రజల్లో భద్రతా ఆందోళనలు పెంచుతున్నాయని చెబుతున్నారు.

దుకాణాల ఎదుట వాహనాలు నిలపడానికి తగిన స్థలం లేకపోవడంతో కొనుగోలుదారులు తమ వాహనాలను రహదారులపైనే పార్కింగ్ చేస్తున్నారని, దీనివల్ల తరచూ ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.




**కొత్త అధికారులారా.. క్షేత్రస్థాయిలో పరిశీలించండి**

ఇటీవలే అశ్వారావుపేట మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్, చైర్మన్ ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీలను ఆక్రమించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రాంతాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు నిబంధనలను కఠినంగా అమలు చేసి అక్రమ పార్కింగ్‌లకు చెక్ పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ లైటింగ్ పనులను పూర్తి చేసి




పట్టణానికి మెరుగైన వెలుతురు సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

అశ్వారావుపేట లాంటి కీలకమైన పట్టణంలో మౌలిక సమస్యలు కొనసాగుతుండటంపై స్థానిక మేధావులు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలైన వీధి దీపాలు, ట్రాఫిక్ నియంత్రణ, ఆక్రమణల నివారణ వంటి అంశాలపై మరింత దృష్టి సారించాలని కోరుతున్నారు. మున్సిపల్ యంత్రాంగం సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి తక్షణ చర్యలు చేపట్టాలని, లేకపోతే ప్రజల్లో అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

# అమరావతి అర్బన్ మొబిలిటీ ప్లానింగ్‌పై సీఎం చంద్రబాబు ఫోకస్

పలు అంశాలను అథారిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, సీఎస్ జి. సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**కోటి మంది లక్ష్యంగా 'యోగాంధ్రప్రదేశ్2026'.. జూన్ 21న కృష్ణా నదిపై సీఎం యోగా**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో 'యోగాంధ్రప్రదేశ్2026' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 21న జరిగే ఈ వేడుకను విజయవంతం చేసేందుకు కోటి మంది ప్రజలను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ఈ కార్యక్రమ నిర్వహణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, జూన్ 21న రాజధాని అమరావతిలో 25 వేల మందితో రాష్ట్ర స్థాయి యోగా ఈవెంట్ నిర్వహించనున్నారు. కృష్ణా నదిపై కొత్తగా నిర్మించిన వంతెనపై జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పాల్గొంటారు. అదే రోజున అన్ని జిల్లా కేంద్రాల్లో వెయ్యి మంది చొప్పున యోగా కార్యక్రమాలను నిర్వహిస్తారు. వీటిలో మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొంటారు. జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా యోగా వారోత్సవాలు జరగనున్నాయి. "ఒక జిల్లా – ఒక థీమ్"తో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు. పార్కులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు రాష్ట్రంలోని 56 పర్యాటక కేంద్రాల్లో ప్రత్యేక యోగా సెషన్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు గాను ప్రతి జిల్లాకు రూ. 25 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ప్రస్తుతం ఉన్న 1.50 లక్షల మంది యోగా శిక్షకులకు అదనంగా మరో లక్ష మందికి శిక్షణ ఇచ్చి, వారిని కూడా ఈ కార్యక్రమంలో భాగం చేయనున్నారు.

**ప్రజలకు అందుబాటులో యోగా వీడియోలు**

ఈ సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ యోగా, నాచురోపతి విభాగ సలహాదారు మంతెన



సత్యనారాయణ రాజు రూపొందించిన 'యోగాంధ్ర' పోస్టర్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. వివిధ ఆసనాలు, ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలపై తాను రూపొందించిన వీడియోలను ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంచుతున్నట్లు మంతెన తెలిపారు. 8142404888 నంబర్‌కు 'ఎఱ' అని మెసేజ్ పంపడం ద్వారా లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఈ వీడియోలను పొందవచ్చని వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆ విషయం చిట్‌చాట్‌లో చెప్పడం కాదు... అధికారికంగా ప్రకటించాలి: కవిత

**రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌పై చిట్‌చాట్‌లో కాకుండా అధికారికంగా ప్రకటించాలన్న కవిత**

**రైతు డిస్కం పేరుతో మిగతా డిస్కంలను ప్రైవేటీకరించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపణ**

**ఈ ప్రైవేటీకరణ కుట్రను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరిక**



రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అంశంపై మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడటం కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయానికి మీటర్లు బిగించేది లేదని కూడా ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలతో ముందుకెళుతున్నాయని ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలో కొత్తగా రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కవిత ఆరోపించారు. ఈ పేరుతో మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కుట్రను అడ్డుకోవడానికి అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరించారు. అదేవిధంగా, కేంద్రం తీసుకొచ్చిన కొత్త సోలార్ జీవో కేవలం బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తుందని ఆమె విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును దసరా నాటికి ప్రతిపాదించకపోతే, తాను పాదయాత్ర చేపడతానని కవిత హెచ్చరించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటనపై కవిత తీవ్రంగా స్పందించారు. ఇది చాలా దారుణమని, దీనికి ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులే బాధ్యత వహించాలన్నారు. ఆ చిన్నారి పేరిట ప్రభుత్వం రూ.25 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో డిగ్రీ, పీజీ కాలేజీలకు వేసవి సెలవులు పొడిగింపు

రాష్ట్రంలో తీవ్రమైన వడగాలులుపుల కారణంగా తెలంగాణలోని యూనివర్సిటీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. డిగ్రీ, పీజీ కాలేజీలకు వేసవి సెలవులను జూన్ 6వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించాయి. వాస్తవానికి జూన్ 1న కాలేజీలు పునఃప్రారంభం కావాల్సి ఉండగా, తాజా నిర్ణయంతో జూన్ 6 నుంచి 8వ తేదీ మధ్య తరగతులు మొదలవుతాయి. ఉస్మానియా, పాలమూరు, తెలంగాణ, కాకతీయ, శాతవాహన యూనివర్సిటీల పరిధిలోని క్యాంపస్, అనుబంధ కాలేజీలకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. ఉస్మానియా, పాలమూరు, తెలంగాణ వర్సిటీలు సెలవులను జూన్ 6 వరకు పొడిగించగా, జూన్ 7 ఆదివారం కావడంతో జూన్ 8న కాలేజీలు తెరుచుకుంటాయి. మరోవైపు, కాకతీయ, శాతవాహన వర్సిటీలు జూన్ 5 వరకు సెలవులు ప్రకటించి, జూన్ 6న తరగతులు ప్రారంభించనున్నాయి. రాష్ట్రంలో కొనసాగుతున్న తీవ్రమైన వేసవి పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనివర్సిటీలు తమ సర్క్యులర్లలో పేర్కొన్నాయి. అయితే, ఈ సెలవులు విద్యార్థులు, టీచింగ్ సిబ్బందికి మాత్రమే వర్తిస్తాయి. ప్రిన్సిపాల్స్, పరిపాలన బాధ్యతల్లో ఉన్న సిబ్బంది యధావిధిగా విధులకు హాజరు కావాలని స్పష్టం చేశాయి. ఇప్పటికే రాష్ట్రంలో పాఠశాలలకు ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు పొడిగించిన విషయం తెలిసిందే. అధ్యాపక సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు తెలంగాణ గవర్నమెంట్ కాలేజెస్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ తెలిపింది. వాతావరణ శాఖ



పలు జిల్లాలకు వడగాలులుపుల హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో, ఈ అదనపు సెలవులు విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరటనిస్తున్నాయి.




## క్యాన్సర్ చికిత్సలో నిమ్స్ మరో ముందడుగు..

# ఖరీదైన పరీక్షలు ఇక ఉచితం

**హైదరాబాద్ నిమ్స్‌లో త్వరలో లిక్విడ్ బయాప్సీ సేవలు ప్రారంభం**

**రక్త నమూనాతోనే క్యాన్సర్ దశ, తీవ్రతను గుర్తించే ఆధునిక పరీక్ష**

**ఇప్పటికే 1443 మందికి ఉచితంగా ఎన్‌జీఎస్ జన్యు పరీక్షలు పూర్తి**

**ఆరోగ్యశ్రీ కింద ఈ ఖరీదైన పరీక్షలన్నీ ఉచితంగా అందించనున్నట్లు వెల్లడి**

**పేద, మధ్యతరగతి రోగులకు ప్రపంచస్థాయి క్యాన్సర్ వైద్యం అందించడమే లక్ష్యం**

హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి క్యాన్సర్ వైద్య రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతోంది. క్యాన్సర్ మహమ్మారిని ప్రాథమిక దశలోనే గుర్తించి, రోగికి ప్రత్యేకమైన చికిత్స అందించే లక్ష్యంతో మరో కీలక ముందడుగు వేసింది. అత్యాధునిక 'లిక్విడ్ బయాప్సీ' పరీక్షలను త్వరలోనే రోగులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ప్రకటించారు. కేవలం రక్త నమూనా ద్వారానే క్యాన్సర్ దశ, దాని తీవ్రతను గుర్తించే ఈ విప్లవాత్మక సేవలను ఆరోగ్యశ్రీ కింద పూర్తిగా ఉచితంగా అందించనుండటం క్యాన్సర్ రోగులకు పెను ఊరటనిచ్చే అంశం. సాధారణంగా క్యాన్సర్ నిర్ధారణకు కణితి నుంచి కొంత భాగాన్ని శస్త్రచికిత్స ద్వారా తీసి 'టిష్యూ బయాప్సీ' చేస్తారు. ఇది రోగికి కొంత బాధ కలిగించే ప్రక్రియ. దీనికి భిన్నంగా, లిక్విడ్ బయాప్సీ విధానంలో కేవలం ఒక రక్తపు చుక్కతోనే శరీరంలో వ్యాపించిన క్యాన్సర్ కణాల డీఎన్ఏను విశ్లేషించి వ్యాధి తీవ్రతను గుర్తిస్తారని నిమ్స్ పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ శాంతవీర్ జి. ఉప్పిన్ వివరించారు. దీనివల్ల రోగికి ఎలాంటి కోత, శస్త్రచికిత్స అవసరం ఉండదు. ఇప్పటికే నిమ్స్‌లోని క్యాన్సర్ జీనోమిక్స్ సెంటర్‌లో 'నెక్ట్స్ జనరేషన్ సీక్వెన్సింగ్' (ఎన్‌జీఎస్) టెక్నాలజీతో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ 'డైమండ్ ప్రాజెక్టు'లో భాగంగా ఈ సేవలను ప్రారంభించారు. క్యాన్సర్‌కు కారణమయ్యే జన్యుపరమైన మార్పులను గుర్తించి, రోగి శరీరతత్వానికి అనుగుణంగా 'టార్గెటెడ్ థెరపీ' అందించడానికి ఈ పరీక్షలు కీలకం. 2024 నుంచి ఇప్పటివరకు సుమారు 1,443 మంది రోగులకు ఈ ఖరీదైన జన్యు పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించి, వారికి మెరుగైన చికిత్స అందించినట్లు డాక్టర్ బీరప్ప తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చయ్యే ఎన్‌జీఎస్, లిక్విడ్ బయాప్సీ వంటి అత్యంత ఆధునిక పరీక్షలను ప్రభుత్వ ఆసుపత్రిలో, అదీ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా అందించడం ఒక చారిత్రాత్మక నిర్ణయం. ప్రభుత్వ మద్దతుతో నిమ్స్ అందిస్తున్న ఈ ప్రపంచస్థాయి వైద్య సేవలు, ఎందరో పేద, మధ్యతరగతి క్యాన్సర్ బాధితులకు పునర్జన్మను ప్రసాదించనున్నాయని వైద్య వర్గాలు భావిస్తున్నాయి.

## అమెరికాలో క్షిపణుల ఉత్పత్తి సరిపోదు: జెలెన్‌స్కీ

అమెరికాలో యాంటీ–బాలిస్టిక్ క్షిపణుల ఉత్పత్తి సరిపడా లేదని, ఇది ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో సంక్షోభానికి దారితీయవచ్చని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు రష్యా తన బాలిస్టిక్ క్షిపణుల ఉత్పత్తిని వేగంగా పెంచుతోందని ఆయన గుర్తుచేశారు. ఈ మేరకు ఆదివారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఆయన ఒక పోస్ట్ చేశారు. ఇదే విషయంపై అమెరికా వైట్ హౌస్, కాంగ్రెస్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. ఒక ఇంటర్వ్యూలో పంచుకున్న వివరాలను జెలెన్‌స్కీ ప్రస్తావిస్తూ "ప్రస్తుత సవాళ్లతో పోలిస్తే, నెలకు 60–65 యాంటీ–బాలిస్టిక్ క్షిపణుల ఉత్పత్తి ఏమాత్రం సరిపోదు. ఈ విషయం రష్యాకు కూడా తెలుసు. మనం ఉత్పత్తిని పెంచాలి. పేట్రియాట్ క్షిపణుల తయారీకి ఉక్రెయిన్‌కు లైసెన్సులు ఇవ్వాలని గత అమెరికా ప్రభుత్వాన్ని కోరాను, ప్రస్తుత ప్రభుత్వాన్ని కూడా కోరుతున్నాను" అని పేర్కొన్నారు. "మేము పేట్రియాట్ క్షిపణుల ఉత్పత్తిని పెంచగలం. ఇది మాకు, మధ్యప్రాచ్యానికి, అమెరికా సహాయం చేయాలనుకునే ఏ దేశానికైనా ఉపయోగపడుతుంది. ఐరోపాలో సొంత యాంటీ–బాలిస్టిక్ వ్యవస్థను తయారు చేసుకునే వరకు మాకు అమెరికా మద్దతు అవసరం" అని జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. రొమేనియా, మాల్డోవా, పోలాండ్, బాల్టిక్ దేశాల వైపు వెళ్తున్న రష్యా డ్రోన్‌లను కూడా తమ దేశం అడ్డుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆయన తెలిపారు. రాబోయే శీతాకాలానికి ముందే చర్చల ద్వారా దౌత్యపరమైన మార్గాన్ని కనుగొనాలని, అయితే ఇది రష్యా సమాజం నుంచి పుతిన్‌పై వచ్చే అంతర్గత ఒత్తిడితో పాటు, అమెరికా, యూరప్ దేశాల ఆంక్షలపైనా ఆధారపడి ఉంటుందని జెలెన్‌స్కీ అభిప్రాయపడ్డారు.

# సమయం లేదు మిత్రమా!

# కరిగిపోతున్న స్నేహ బంధాలు

ఒకప్పుడు సాయంత్రం అయిందంటే చాలు.. రచ్చబండల దగ్గరో, వీధి చివర వేపచెట్టు కిందో స్నేహితుల సందడి కనిపించేది. గంటల తరబడి ముచ్చట్లు, కష్టసుఖాల పంపకాలు, ఒకరికొకరు ఉన్నామనే భరోసా ఉండేవి. కానీ, నేటి ఆధునిక, యాంత్రిక జీవన శైలిలో మనుషుల మధ్య దూరం పెరుగుతోంది. టెక్నాలజీ పెరిగి ప్రపంచం అంతా మన అరచేతిలోకి వచ్చేసింది కానీ, పక్కనున్న మనిషితో మాట్లాడే తీరిక లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ఒక విచిత్రమైన కొరత ఏర్పడింది, అదే స్నేహితుల కొరత. ఈ స్నేహాల క్షీణతపై వస్తున్న సర్వేలు ఆందోళన కలిగించే వాస్తవాలను బయటపెడుతున్నాయి.

స్నేహాల విషయంలో కాలక్రమేణా వచ్చిన మార్పులను గమనిస్తే గ్రాఫ్ చాలా దారుణంగా పడిపోతోంది. గత శతాబ్దంలో 1960 ప్రాంతంలో ఒక్కొక్కరికి సగటున వంద మంది స్నేహితులు ఉండేవారట. ఆ తర్వాత 1990ల నాటికి ఆ సంఖ్య యాభైకి పడిపోయింది. ఇక 2020 నాటికి కేవలం పది మంది మాత్రమే మిగిలారు. ప్రస్తుత పరిస్థితి చూస్తే ఇప్పుడు కనీసం ఒక్క నిజమైన స్నేహితుడు ఉండటం కూడా గగనమైపోతోంది. ఒక సర్వే ప్రకారం మన దేశంలో పన్నెండు శాతం జనాభాకు అసలు స్నేహితులే లేరని తేలింది. గతంలో స్నేహితులతో ముఖాముఖి గడిపే సమయం రోజుకు సగటున ఒక గంట ఉంటే, అది ప్రస్తుతానికి కేవలం ముప్పై ఐదు నిమిషాలకే పరిమితమైపోయింది.

నిజానికి మంచి స్నేహితులు కేవలం కాలక్షేపానికి మాత్రమే కాదు, మన ఆరోగ్యానికి ఒక రక్షణ కవచం లాంటివారు. స్నేహం అనేది జీవితానికి ఒక లైఫ్ ఇన్సూరెన్స్ వంటిది. స్నేహితులు లేనివారు అనుభవించే ఒంటరితనం, మానసిక ఒత్తిడి రోజుకు ఇరవై సిగరెట్లు తాగినంత ప్రమాదకరమని పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. మంచి స్నేహితులు ఉన్నవారిలో బ్లడ్ ప్రెజర్, గుండె వ్యాధుల ముప్పు చాలా తక్కువగా ఉంటుంది. స్నేహితులు తోడుగా ఉన్నవారు ఎప్పుడూ ఆహ్లాదంగా ఉంటారు. వారు వ్యాయామం, క్రీడలు, ఇతర సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. ఆత్మీయుల సాంగత్యంలో గడపడం వల్ల మన శరీరంలో హ్యాపీ హార్మోన్లు విడుదలై, రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

కానీ, మంచి స్నేహితులు ఊరికే లభించరు. స్నేహానికి మనం పెట్టాల్సిన అతిపెద్ద పెట్టుబడి సమయం. ఒక పరిశోధన ప్రకారం ఒక గట్టి బంధం ఏర్పడటానికి చాలా సమయం కేటాయించాల్సి ఉంటుంది. కనీస పరిచయం ఏర్పడాలంటే నలభై గంటలు కలిసి గడపాలి, ఒక మాదిరి స్నేహం ఏర్పడాలంటే ఇంకో తొంభై గంటలు కావాలి, అదే ప్రాణ స్నేహం అవ్వాలంటే మరో నలభై గంటలు కేటాయించాల్సి ఉంటుంది. మరి ఇంత సమయం నేటి డిజిటల్ యుగంలో మన దగ్గర ఉందా అంటే సమాధానం శూన్యం. ఒకసారి మంచి స్నేహం ఏర్పడ్డాక కూడా దానిని నిలుపుకోవాలంటే రోజూ లేదా వారానికోసారైనా కొంత సమయం



కేటాయించాల్సిందే.

నేటి సమాజంలో మనం స్నేహం అని భ్రమిస్తున్న వాటిలో చాలావరకు నిజమైనవి కావు. మనం పనిచేసే ప్రాంతంలో ఉండే ఆఫీస్ స్నేహాలు చాలా వరకు కేవలం ఉపరితల ముచ్చట్లే. సీటు మారితేనో, ఉద్యోగం మారితేనో అవి మాయమైపోతాయి. ఇక ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఉండే వందల మంది సోషల్ మీడియా ఫ్రెండ్స్ కేవలం లైకులు, కామెంట్లకే పరిమితం. ఇవి చొప్పదండూ ముచ్చట్ల లాంటివే, కష్టం వస్తే స్క్రీన్ వెనుక ఉన్న మనిషి మన దగ్గరకు రాడు. అలాగే బార్ అండ్ రెస్టారెంట్లలో కలిసి తాగే స్నేహాలు ఆ మత్తు ఉన్నంత వరకే, గ్లాసు ఖాళీ అయితే బంధం కూడా ఖాళీ అయిపోతుంది.

మొత్తం మీద చూస్తే నేటి సమాజంలో స్నేహానుబంధాలు చాలా వేగంగా కరిగిపోతున్నాయి. ఇందుకు అనేక కారణాలు ఉన్నప్పటికీ, అందరూ చెప్పే ఒకే ఒక్క సాకు సమయం లేదు మిత్రమా. కానీ, కెరీర్, డబ్బు, సోషల్ మీడియా పరుగులో పడి మన జీవితానికి రక్షణ నిచ్చే లైఫ్ ఇన్సూరెన్స్ లాంటి స్నేహాన్ని కోల్పోవద్దు. ఇప్పటికైనా మేల్కొందాం, వారంలో కనీసం కొంత సమయాన్ని స్నేహితుల కోసం కేటాయిద్దాం. కొత్తగా మంచి స్నేహాలను పెంపొందించుకుందాం. అన్నిటికంటే ముఖ్యంగా, ఇప్పటికే మీ జీవితంలో ఉన్న పాత, మంచి స్నేహితులను ఫోన్ కాల్ ద్వారానో, కాఫీ కప్పుతోనో కలిసి ఎలాగైనా నిలుపుకుందాం.

**- నవతరం డెస్క్,ఎల్లంపల్లి**




## గాజువాకలో ఘోర రోడ్డు ప్రమాదం..

**ఆగివున్న లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు, ముగ్గురు మృతి**

**ప్రమాదంలో డ్రైవర్ సహా ముగ్గురు అక్కడికక్కడే మృతి**

**ఏడుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు, ఆస్పత్రికి తరలింపు**

**రాజమహేంద్రవరం నుంచి పార్వతీపురం వెళ్తుండగా ఘటన**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందిన విషాదకర ఘటన విశాఖ జిల్లా గాజువాకలో ఈ రోజు వేకువజామున జరిగింది. శ్రీనగర్ సమీపంలో జాతీయ రహదారిపై ఆగివున్న లారీని ఏపీఎస్ ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో బస్సు డ్రైవర్‌తో సహా ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. రాజమహేంద్రవరం నుంచి 30 మంది ప్రయాణికులతో పార్వతీపురం వెళ్తున్న సమయంలో ఆర్టీసీ బస్సు ఈరోజు వేకువజామున 4 గంటల సమయంలో గాజువాక శ్రీనగర్ వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని డ్రైవర్ గమనించకపోవడంతో ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ రాంబాబు, ప్రయాణికురాలు ఈశ్వరమ్మతో పాటు మరో గుర్తుతెలియని మహిళ మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదంపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గండిపేటలో రూ.1500 కోట్ల

# ప్రభుత్వ భూమి కబ్జాకు భారీ కుట్ర

**ఈ కుంభకోణంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాత్రపై ఆధారాలు**

**నకిలీ జీవోల తయారీకి రూ.4 కోట్లు చెల్లించినట్లు డీసీపీ శ్రీనివాస్ వెల్లడి**

**ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్ట్ చేసిన సైబరాబాద్ పోలీసులు**

**బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారని, గాలింపు కొనసాగుతోందని ప్రకటన**



హైదరాబాద్ శివారు గండిపేటలో వెలుగు చూసిన భారీ భూ కుంభకోణం కేసులో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. సుమారు రూ.1500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని నకిలీ పత్రాలతో కబ్జా చేసేందుకు జరిగిన ఈ కుట్రలో కీలక వ్యక్తి వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడేనని, అందుకు తమ వద్ద పక్కా ఆధారాలున్నాయని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం నాడు విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన కీలక వివరాలను ఆయన వెల్లడించారు. డీసీపీ శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ కుంభకోణంలో బొల్లా బ్రహ్మనాయుడి పాత్ర అత్యంత కీలకంగా ఉంది. గండిపేటలోని వివాదాస్పద భూమిని క్రమబద్ధీకరించినట్లుగా నకిలీ ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) సృష్టించేందుకు, ప్రధాన నిందితుడైన రాధాకృష్ణకు బ్రహ్మనాయుడు రూ.4 కోట్లు చెల్లించినట్లు విచారణలో తేలిందని డీసీపీ తెలిపారు. ఈ లావాదేవీలన్నీ నగదు రూపంలోనే జరిగాయని, ఈ సొమ్ము ఎక్కడికి వెళ్లిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కుట్రలో భాగంగా నిందితులు అత్యంత పకడ్బందీగా నకిలీ పత్రాలు సృష్టించారని, కలెక్టర్, సీసీఎల్ఏ కార్యాలయాల నుంచి అనుమతులు వచ్చినట్లు నకిలీ దస్త్రాలు, ఐఏఎస్ అధికారుల ఫోర్జరీ సంతకాలతో ఉత్తర్వులు తయారు చేశారని వివరించారు. గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఈ కేసును నమోదు చేసినట్లు డీసీపీ తెలిపారు. వాట్సాప్ గ్రూపులలో నకిలీ జీవోలు సర్క్యులేట్ కావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఇప్పటికే నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌లతో పాటు ప్రధాన నిందితుడు రాధాకృష్ణ, అతని డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు డీసీపీ వెల్లడించారు. ఇప్పటికే 9 కేసులలో నిందితుడిగా ఉన్న రాధాకృష్ణ నుంచి కందుకూరు, అంబర్‌పేట ప్రాంతాలకు చెందిన పలు భూముల పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల నుంచి నకిలీ జీవో కాపీలు, 13 నకిలీ స్టాంపులు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, చెక్‌బుక్కులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గండిపేటలోని సర్వే నంబర్ 18లో ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ఈ కుట్ర పన్నారు. దీని విలువ మార్కెట్ అంచనాల ప్రకారం రూ.1000 నుంచి రూ.1500 కోట్ల వరకు ఉంటుంది. ఇప్పటికే ఈ భూమికి సంబంధించిన యాజమాన్య హక్కుల పిటిషన్‌ను 2025లోనే హైకోర్టు కొట్టివేసినప్పటికీ, ఇంత విలువైన భూమిపై ఒప్పందాలు చేసుకోవడం అనుమానాలకు తావిస్తోందని డీసీపీ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసులో బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్‌తో పాటు మరికొందరు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని డీసీపీ శ్రీనివాస్ వివరించారు. నగదు రూపంలో జరిగిన కోట్ల రూపాయల లావాదేవీలపైనా దృష్టి సారించి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.



## పీఎం సేతు పథకం అమలులో ఏపీ ఫస్ట్..

## విశాఖ ఐటీఐ క్లస్టర్‌కు కేంద్రం ఆమోదం

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి స్కిల్లింగ్ అండ్ ఎంప్లాయబిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ త్రూ అప్‌గ్రేడెడ్ ఐటీఐస్ (పీఎం–సేతు) పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి రాష్ట్రంగా నిలిచింది. ఈ పథకం కింద విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్‌కు సంబంధించిన వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళికకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ స్టీరింగ్ కమిటీ (ఎన్ఎస్‌సీ) ఆమోదముద్ర వేసింది. దేశవ్యాప్తంగా పీఎం–సేతు కింద ఆమోదం పొందిన తొలి ప్రాజెక్టు ఇదే కావడం విశేషం. ప్రముఖ ఉక్కు తయారీ సంస్థ ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా (ఏఎం/ఎన్ఎస్ ఇండియా), న్యూ ఏజ్ మేకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నామ్‌టెక్)తో కలిసి ఈ ప్రాజెక్టును అమలు చేయనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా విశాఖపట్నంలోని ప్రభుత్వ ఐటీఐలను 'హబ్ అండ్ స్పోక్' నమూనాలో ఆధునికీకరిస్తారు. పరిశ్రమల ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సాంకేతిక శిక్షణ అందిస్తారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాల్లో భాగంగా, దేశవ్యాప్తంగా 1,000 ప్రభుత్వ ఐటీఐలను ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 60,000 కోట్ల బడ్జెట్‌తో ఈ పథకాన్ని ప్రారంభించింది. కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకం మొదటగా ప్రారంభం కానుండటంతో, ఇది ఇతర రాష్ట్రాలకు ఒక నమూనాగా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు.

# హైదరాబాద్ పుష్పక్ తరహాలో..

# భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు

**విశాఖ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు 50 ఎలక్ట్రిక్ బస్సులు**

**త్వరలోనే అందుబాటులోకి వస్తాయన్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి**

**జులైలో ప్రారంభం కానున్న ఎయిర్‌పోర్ట్‌కు మెరుగైన కనెక్టివిటీ లక్ష్యం**

**ప్రయాణికుల కోసం పలుచోట్ల ఏసీ ప్యాసింజర్ లాంజ్‌ల నిర్మాణం**



విశాఖపట్నం నుంచి త్వరలో ప్రారంభం కానున్న భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికుల కనెక్టివిటీని పెంచే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగరం నుంచి ఎయిర్‌పోర్ట్‌కు 50 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం విశాఖలో మీడియాకు తెలిపారు. జులై మొదటి వారంలో విమానాశ్రయం కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున వీలైనంత త్వరగా ఈ బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి వివరించారు. హైదరాబాద్‌లోని పుష్పక్ బస్సుల తరహాలో ఈ ఏసీ ఎలక్ట్రిక్ బస్సుల సర్వీసులను నడిపి, ప్రయాణికులకు సౌకర్యవంతమైన, పర్యావరణ హితమైన ప్రయాణాన్ని అందిస్తామని తెలిపారు. జాతీయ రహదారి–16, బీచ్ రోడ్ కారిడార్ల మీదుగా ప్రధానంగా ఈ సర్వీసులు నడవనున్నాయి. వాస్తవానికి, భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీపై గత కొంతకాలంగా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. తొలుత 8 నుంచి 30 బస్సులతో సర్వీసులు ప్రారంభించాలని ప్రతిపాదనలు వచ్చాయి. తాజా ప్రకటనతో బస్సుల సంఖ్యను 50కి పెంచినట్లు స్పష్టమైంది. దీనికి తోడు, కూర్మన్నపాలెం, గాజువాక, ఎన్ఏడీ జంక్షన్, మద్దిలపాలెం, మధురవాడ, తగరపువలస వంటి కీలక ప్రాంతాల్లో ప్రయాణికుల కోసం ఏసీ ప్యాసింజర్ లాంజ్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. విశాఖకు సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న భోగాపురం విమానాశ్రయం నిర్మాణం దాదాపు పూర్తి కావొచ్చింది. ఇది ఉత్తరాంధ్రకు ప్రధాన ఏవియేషన్ హబ్‌గా మారనుంది. ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోనే బస్సుల కోసం తాత్కాలిక ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. విమానాశ్రయం ప్రారంభమైన తర్వాత ప్రయాణికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను, రూట్లను మరింత పెంచే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ కొత్త బస్సు సర్వీసుల ద్వారా ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, ట్రాఫిక్ రద్దీని నియంత్రించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.




## నెల మొదట్లోనే షాక్.. పెరిగిన వాణిజ్య సిలిండర్ ధరలు

వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ల ధరలను ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు పెంచాయి. జూన్ 1 నుంచి ఈ కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి. ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై రూ. 42 పెరగడంతో, దాని ధర రూ. 3,113.50కి చేరింది. అయితే, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పులు చేయకపోవడం సామాన్య ప్రజలకు ఊరటనిచ్చే విషయం. ఈ ధరల పెంపు ఇతర నగరాల్లోనూ వర్తిస్తుంది. కోల్‌కతాలో 19 కేజీల కమర్షియల్ సిలిండర్ ధర రూ. 53.50 పెరిగి రూ. 3,255.50కి చేరుకుంది. వీటితో పాటు ఢిల్లీలో 5 కేజీల ఫ్రీ ట్రేడ్ ఎల్పీజీ (ఎఫ్టీఎల్) సిలిండర్ ధర కూడా రూ. 11 పెరిగి రూ. 821.50కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రతినెలా జరిగే సమీక్షలో భాగంగా ఈ స్వల్ప పెంపు చోటుచేసుకుంది. గత మే నెలలో అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో కమర్షియల్ సిలిండర్‌పై ఏకంగా రూ. 993 పెంచిన విషయం తెలిసిందే. ఆ భారీ పెంపుతో పోలిస్తే తాజా వడ్డన చాలా తక్కువ. మరోవైపు, సబ్సిడీ కింద ఇచ్చే 14.2 కేజీల డొమెస్టిక్ సిలిండర్ ధరను ఢిల్లీలో రూ. 913 వద్ద స్థిరంగా ఉంచారు. తాజా పెంపుతో హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య సంస్థలపై నిర్వహణ భారం స్వల్పంగా పెరగనుంది. ఇదిలా ఉండగా, సబ్సిడీ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం, పక్కదారి పట్టించడాన్ని నిరోధించేందుకు ప్రభుత్వం తనిఖీలను ముమ్మరం చేసింది.

# మనీ ప్లాంట్ ఇంట్లో ఉంటే అందం, అదృష్టంతో పాటు కలిగే ప్రయోజనాలు



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మనల్ని మనం రీఛార్జ్ చేసుకునేలా ఉపయోగపడే ఒక పచ్చటి ఎనర్జీ బూస్టర్ మనీ ప్లాంట్. ఖరీదైన షోపీస్‌లు ఇవ్వే ఎన్నో ప్రయోజనాలు ఈ మనీప్లాంట్ ఇస్తుంది. ఇంటికి నేచురల్ హుందాతనంతో పాటు రాజసాన్ని ఇచ్చి మన ఇంటి రూపు రేఖల్ని మార్చేస్తుంది. గాల్లోని కాలుష్యాన్ని పీల్చుకుంటూ మనకు ప్రాణవాయువును పంచుతుంది. ఎక్కువ మెయింటెనెన్స్ లేకుండా చాలా సింపుల్‌గా చిన్న కుండీలో పెరుగుతుంది. ఆఫీస్ డెస్క్, ఇళ్లు ఎక్కడైనా ఈ మొక్క ఇచ్చే సానుకూలత అంతా ఇంతా కాదనే చెప్పాలి. మనకు ప్రకృతి ప్రసాదించిన పచ్చటి కానుకల్లో మనీ ప్లాంట్ ఒకటి. దీని స్టైల్, ఉపయోగాలు వేరు. ఇది కేవలం అలంకరణ కోసం ఉంచే మొక్క మాత్రమే కాదు.. నేటి ఆధునిక జీవనశైలిలో ఒక నిశ్శబ్ద విప్లవం అని చీూవీ అధ్యయనం పేర్కొంది. కాంక్రీట్ జంగిల్‌లో బంధీ అయిన మనిషికి స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తూ తన ఉనికిని చాటుకుంటోంది. ముదురు ఆకుపచ్చ రంగుతో, హార్ట్‌షేప్ ఆకులతో మన కళ్లకు హాయిని ఇస్తూనే ఇంటి వాతావారణాన్ని పాజిటివ్ ఎనర్జీతో నింపుతుంది. వాస్తు ప్రకారం చూసినా ఇంటి అదృష్టానికి చిహ్నంగా ఉంటుంది. అలాగే సైన్స్ ప్రకారం మనీప్లాంట్ గాలిని శు ద్ధి చేసే సాధనంగా ఉపయోగపడుతుందని =వంఋతీఎష్ట్ర+ఛ్వ అధ్యయనం పేర్కొంది. అతి తక్కువ మెయింటెనెన్స్‌తో మన మంచి స్ట్రెస్ బస్టర్‌లా పని చేస్తుంది. అంతే కాకుండా మనీ ప్లాంట్ ఇంట్లో ఉండటం వల్ల అనేక లాభాలు ఉన్నాయి. అవేంటో ఈ స్టోరీలో వివరంగా తెలుసుకుందాం.. మనీ ప్లాంట్ ఇంట్లో ఉంటే రిచ్, ఫ్రెష్ లుక్‌ని ఇస్తుంది. దీనిని కుండీల్లో, గాజు సీసాల్లో, హ్యాంగింగ్ బాస్కెట్లలో పెంచుకోవచ్చు. మన కళ్లకు హాయిని ఇవ్వడమే కాకుండా ఇంట్లో ఏ రకమైన ఫర్నీచర్ ఉన్నా ఆ రూమ్ అందాన్ని రెట్టింపు చేస్తుంది. దీనిని మెయింటెనెన్స్ కూడా చాలా తక్కువగా ఉంటుంది. మన మన ఇళ్లలో ఏసీలు, సింథటిక్ వస్తువుల వాడకం ఎక్కువ అయిపోయింది. అయితే ఈ మనీ ప్లాంట్ గాల్లోని విష తుల్యాలను తొలగిస్తుంది. అంతే కాకుండా ఇది ట్యాక్సిన్స్ క్లీనర్‌గా కూడా పని చేస్తుంది. ఇది గాల్లోని బెంజీన్, ఫార్మాల్డిహైడ్, కార్బన్ మోనాక్సైడ్ వంటి హానికరమైన వాయువులను పీల్చుకుంటుంది. ఇంటిలోపల ఆక్సిజన్ స్థాయిలను పెంచి శ్వాస సంబంధిత ఇబ్బందులను తొలగిస్తుంది. నేటి ఆధునిక ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడి ఎక్కువ అయిపోయింది. మానసిక ప్రశాంతత కరువైంది. ఇంట్లో మనీ ప్లాంట్ ఉండటం వల్ల బీపీ, ఆందోళన, ఒత్తిడి వంటివ తగ్గుతాయి. అలాగే బెడ్‌రూమ్‌లో మనీ ప్లాంట్ ఉంటే గాలి శుద్ధి చేసి నిద్ర బాగా పట్టడానిని సహకరిస్తుంది. తద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుంది. ప్రస్తుతం మనం ఇంట్లో ఎక్కువగా మొబైల్స్, వైఫై, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్స్ ఎక్కువగా ఉపయోగిస్తున్నాం. అయితే ఈ మనీ ప్లాంట్ కంప్యూటర్, ఇతర ఎలక్ట్రానిక్స్ నుంచి విడుదలయ్యే ఎలక్ట్రోమాగ్నటిక్ రేడియేషన్‌ను కొంత వరకు గ్రహించే శక్తిని కలిగి ఉంటుంది. అందుకే దీనిని డ్రాయింగ్ రూమ్‌లలో, ఆఫీస్‌లో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇక ఇంట్లో మనీ ప్లాంట్ ఉండే ప్రతికూల శక్తులను తొలగించి, పాజిటివ్ ఎనర్జీని పెంచుతుంది. అంతే కాకుండా ఈ మొక్క చిగురిస్తూ ఉంటే ఆ ఇంట్లో ఐశ్వర్యం, అదృష్టం పెరుగుతాయని చాలా మంది నమ్ముతారు.

# చేపల కూర నీచు వాసన రాకుండా చేసే నేచురల్ చిట్కాలు



చేపల కూర అనగానే మనకు గుర్తుకు వచ్చేది నోరూరించే రుచి కంటే వండకముందు వచ్చే నీచు వాసన. ఆ నీచు వాసన భరించడం చాలా కష్టం. ఎంత కడిగినా ఆ వాసన పోలేదని విసుక్కుంటూ ఉంటాం. కానీ వంటింట్లో దొరికే సహజసిద్ధమైన పదార్థాలతోనే చేపల వాసనను పరిష్కరించవచ్చు. ప్రకృతి సిద్ధమైన టిప్స్ పాటిస్తే ఆరోగ్యంతో పాటు రుచి కూడా సొంతమవుతుంది. నీచు వాసనను మాయం చేసి చేపల కూరను మరింత రుచిగా మార్చే నేచురల్ చిట్కాలను ఈ స్టోరీలో వివరంగా తెలుసుకుందాం.. ఆదివారం వచ్చిందంటే చాలు మాంసాహార ప్రియులకు చేపలు తినాలనే కోరిక మొదలవుతుంది. అయితే చేపల కూర ఎంత ఆరోగ్యకరమో వాటిని శుభ్రం చేయడం అంతకంటే పెద్ద సవాలుతో కూడుకున్న పని. ముఖ్యంగా పచ్చి చేపల నుంచి వచ్చే నీచు వాసన ఇల్లంతా పాకేస్తుందని చాలా మంది వండటానికి కూడా ఇష్టపడరు. ఆ వాసన మన చేతులకు, మనం వాడే గిన్నెలకు కూడా అంటుకుని వదలదు. ఈ చేపలను కేవలం నీళ్లతో కడిగితే జిడ్డు, వాసన అసలు పోవు. దానివల్ల కూర వండిన తర్వాత కూడా ఆ నీచు వాసన అలాగే ఉండి కూర రుచిని పాడు చేస్తుంది. అయితే మన అమ్మమ్మల కాలం నాటి కొన్ని వంటింటి చిట్కాలు పాటిస్తే ఈ చేపల నీచు కంపును పోగొట్టవచ్చు. రసాయనాలు ఏవీ వాడకుండా, మన పోపుల పెట్టెలో ఉండే వస్తువులతోనే ఈ నీచు వాసనకు చెక్ పెట్టొచ్చు. ఈ సహజ పద్ధతుల్లో శుభ్రం చేయడం వల్ల నీచు వాసన పోవడమే కాదు ముక్క కూడా తాజాగా ఉంటుంది. చేపల కూర రెండు రోజులు ఉన్నా కూడా రుచిగా ఉంటుంది. మరి ఆ నేచురల్ చిట్కాలు ఏమిటో ఇప్పుడు మనం చూద్దాం.. నిమ్మరసం, ఉప్పు కాంబినేషన్ అద్భుతమైన క్లీనింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుందని ాజ× అధ్యయనం పేర్కొంది. చేపలపై ఉండే జిడ్డును, పొలుసుల మధ్య మురికిని వదిలించడంలో ఉప్పు బాగా పనిచేస్తుంది. చేప ముక్కల్లోని బ్యాక్టీరియాను తొలగించడానికి కూడా ఉప్పు తోడ్పడుతుంది. ఇక నిమ్మరసంలో ఉండే సిట్రిక్ యాసిడ్ చేపల నుంచి వచ్చే నీచు వాసనను నిర్వీర్యం చేస్తుంది. చేపలు ఇంటికి తీసుకురాగానే రాళ్ల ఉప్పు వేసి బాగా రుద్దాలి. పొలుసులు లేకుండా బాగా క్లీన్ చేసిన తర్వాత కొంచెం నిమ్మరసం పోసి మరోసారి నెమ్మదిగా రుద్దాలి. ఆ తర్వాత బాగా శుభ్రంగా కడిగేయాలి. ఈ పద్ధతి చాలా పాతది. పెరుగులో ఉండే లాక్టిక్ యాసిడ్ చేపల నుంచి వాసనను తటస్థీకరిస్తుంది. చేప ముక్క కూడా మృదువుగా ఉండేలా చేస్తుంది. అలాగే చేపల పైన ఉండే జిగురును తొలగించడంలో మజ్జిగ బాగా పనిచేస్తుంది. చేప ముక్కలను మొదట మంచి నీళ్లతో బాగా శుభ్రం చేసి అందులో రెండు మూడు స్పూన్ల పుల్లటి పెరుగు కలపిండి. అదే మజ్జిగ అయితే చేపలు మునిగే వరకు పోయాలి. సుమారు 10 నిమిషాలు తర్వాత బయట తీసి నీళ్లతో శుభ్రంగా కడగాలి. చేపలను శుభ్రం చేయడంలో పసుపు కింగ్. పసుపులో ఉండే యాంటీ మైక్రోబియల్ గుణాలు చేపలపై ఉండే సూక్ష్మజీవులను సమర్థవంతంగా తొలగిస్తాయి. చేపలు చనిపోయిన తర్వాత వచ్చే అమ్మోనియా వాసనను పసుపు సమర్థవంతంగా నివారిస్తుంది. అలాగే చేపలకు ఉండే జిగురు సులభంగా వదిలిపోయి ముక్క నీట్‌గా ఉంటుంది. వెనిగర్ ఒక శక్తివంతమైన క్లీనింగ్ ఏజెంట్. ముఖ్యంగా రెస్టారెంట్లలో, పెద్ద పెద్ద హోటల్స్‌లో చేపల క్లీనింగ్‌కు దీనిని ఉపయోగిస్తారు. వెనిగర్‌లో ఉండే ఎసిటిక్ యాసిడ్ చేపల నుంచి వచ్చే నీచు వాసనను తటస్థీకరిస్తుంది. అంతే కాకుండా వెనిగర్ సాయంతో క్లీన్ చేసిన ముక్కలు తెల్లగా, తాజాగా కనిపిస్తాయి. అంతే కాకుండా వండేటప్పుడు ముక్క గట్టిగా ఉండి విరిగిపోకుండా ఉంటుంది. ఇక క్లీనింగ్ ప్రాసెస్ ఎలాగంటే.. ఒక గిన్నెలో కొన్ని నీళ్లు తీసుకుని అందులో రెండు మూడు స్పూన్ల వైట్ వెనిగర్ వేయాలి. శుభ్రం చేసిన ముక్కలను వెనిగర్ నీళ్లలో వేసి 5 నిమిషాలలోపు తీసేయాలి. ఆ తర్వాత చేప ముక్కలను మంచి నీటిలో వేసి బాగా కడిగేయాలి.



# ఒకే కలర్.. ఒకే డిజైన్, అమ్మా కూతుళ్ల అదిరిపోయే ట్విన్నింగ్ ఫ్యాషన్ ఐడియాలు



అమ్మంటే కేవలం బాధ్యత మాత్రమే కాదు.. అదిరిపోయే స్టైల్‌కి చిరునామా కూడా. పిల్లలు పుట్టగానే తనలోని ఫ్యాషన్‌ని పక్కనబెట్టి మనల్ని ముస్తాబు చేసిన అమ్మకు.. ఇప్పుడు మనం తోడైతే ఆ అందమే వేరు. నేటి ఫ్యాషన్ ప్రపంచంలో ట్విన్నింగ్ అనేది అమ్మా కూతుళ్ల మధ్య సరికొత్త కమ్యూనికేషన్‌గా మారింది. అమ్మ పాతకాలపు హుందాతనాన్ని కూతురి నేటి తరం జోష్‌ను ఒకే రకమైన దుస్తుల్లో చూస్తేంటే రెండు తరాల కలయికలా ఎంతో అందంగా కనిపిస్తుంది. ఈ మదర్స్ డే 2026 రోజున అమ్మ లోకానికి ఫ్యాషన్ రంగులు అద్ది బంధాన్ని మరింత ట్రెండీగా మార్చేద్దాం.. అమ్మ చీర కొంగు పట్టుకుని నడక నేర్పినప్పటి నుంచి అమ్మలా తయారు కావాలని మురిసిపోయే వరకు.. ప్రతి కూతురికి అమ్మే మొదటి ఫ్యాషన్ ఐకాన్. అమ్మ రూపం తనలో ప్రతిబింబించాలని అనుకునే ఆడబిడ్డ ఉండదు అంటే అతిశయోక్తి కాదు. అందుకే ప్రస్తుతం మదర్ అండ్ మీ ట్విన్నింగ్ ఫ్యాషన్ కేవలం ఒక ట్రెండ్ మాత్రమే కాదు. అమ్మా కూతుళ్ల మధ్య ఉండే అమూల్యమైన బంధానికి రంగుల వేడుక. ఒకే రకమైన దుస్తులు ధరించి చిరునవ్వులతో ఇద్దరూ మెరిసిపోతుంటే అది చూడటానికి అద్భుతమైన దృశ్య కావ్యంలా అనిపిస్తుంది. అమ్మంటే కూతురి మొట్టమొదటి రోల్ మోడల్. అమ్మలా రెడీ అవ్వాలని, అమ్మ చీర కట్టుకోవాలని ప్రతి చిన్నారికీ ఉంటుంది. ఆ కోరికను నెరవేస్తూనే అమ్మా కూతుళ్ల బంధాన్ని మరింత అందంగా చూపించడమే ఈ ట్విన్నింగ్ ఫ్యాషన్ ఉద్దేశం. 1. కంప్లీట్ మ్యాచింగ్ : తల నుంచి కాళ్ల వరకు ఒకే రకమైన కలర్, మెటీరియల్, డిజైన్‌తో ఉన్న దుస్తులు ధరించడం. ఉదాహరణకు ఇద్దరూ ఒకే రకమైన కలర్ డ్రెస్‌లు లేదా చీరలు ధరించడం. 2. కో ఆర్డినేటెడ్ స్టైల్ : రంగులు వేరైనా కూడా డిజైన్ ఒకేలా ఉండటం. లేదా ఒకే ఫ్యాబ్రిక్‌తో అమ్మ శారీ, కూతురు ఫ్రాక్ కుట్టించుకుని ధరించడం. 3. కాంట్రాస్ట్ ట్విన్నింగ్ : అంటే అమ్మ డ్రెస్ కలర్ కూతురి ఓణీకి ఉండటం లేదా అమ్మ బ్లౌజ్ కలర్ కూతురు గౌనుకి ఉండటం అన్నమాట. పండుగలు, ఫంక్షన్లకు పట్టు వస్త్రాలు, కాంచీవరం బోర్డర్ ఉన్న లెహంగాలు, అనార్కలీలు అద్భుతంగా ఉంటాయి. అలాగే ఒకే రకమైన కొటేషన్లు ఉన్న టీ షర్టులు ధరించడం, బీచ్‌కి, టూర్స్‌కి వెళ్లినప్పుడు ఒకే రకమైన ఫ్లోరల్ ప్రింట్ ఉన్న మ్యాక్సీ డ్రెస్‌లు ధరించడం ఫోటోలకి చాలా బాగుంటాయి. పెద్దవాళ్లకు, పిల్లలకు ఒకే ఫ్యాబ్రిక్ నప్పకపోవచ్చు. పిల్లలకు సాఫ్ట్ సిల్క్ లేదా ప్యూర్ కాటన్ సెలక్ట్ చేసుకోవడం బెస్ట్. భారీ వర్క్, బరువు ఉన్న బట్టలు పిల్లలు ఎక్కువ సమయం వేసుకోలేరు. కాబట్టి అమ్మ డ్రెస్ గ్రాండ్‌గా ఉన్నా కూతురు డ్రెస్ మాత్రం తేలికగా ఉండేలా చూసుకోవాలి. దుస్తులే కాకుండా ధరించే యాక్ససరీస్, ఇతర విషయాల్లో కూడా ట్విన్నింగ్ ట్రై చేయవచ్చు. ముఖ్యంగా ఒకే రకమైన హెయిర్ బ్యాండ్స్, హెయిర్ పిన్స్ పెట్టుకోవడం, మ్యాచింగ్ ఫుట్‌వేర్ ధరించడం, ఒకే డిజైన్ ఉన్న బ్లాక్ బీడ్స్, సింపుల్ పెండెంట్స్ ధరించడం బాగుంటుంది.

# హంటావైరస్ సోకితే శరీరంలో కనిపించే లక్షణాలు, నిర్లక్ష్యం చేస్తే గుండె, కిడ్నీల వైఫల్యం!

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా హంటావైరస్ కలకలం సృష్టిస్తుంది. ఓ విహార నౌకలో ఇది సోకి ముగ్గురి మృతి చెందడమే కాకుండా.. పలువురు దీని బారిన పడ్డారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా దీనిపై అన్ని దేశాలను అలర్ట్ చేసింది. అసలు హంటావైరస్ అంటే ఏంటి? దీని లక్షణాలు ఎలా ఉంటాయో పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. సాధారణంగా వాతావరణ మార్పులు జరిగినప్పుడు జ్వరం రావడం సహజం. కానీ, కొన్ని రకాల జ్వరాలు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. అటువంటి వాటిలో హంటావైరస్ (ఝఞఝజఅతీబం) ఒకటి. ఇది ఎలుకల ద్వారా వ్యాపించే ఒక ప్రమాదకరమైన వైరల్ వ్యాధి. ప్రారంభంలో సాధారణ జ్వరంలా అనిపించినా, సరైన సమయంలో గుర్తించకపోతే ఇది శరీరంలోని కీలక అవయవాలను దెబ్బతీస్తుంది. అసలు హంటా వైరస్ అంటే ఏంటి, ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి, తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో వివరించారు డాక్టర్ వంశీ వి( కన్సల్టెంట్, ఇంటర్నల్ మెడిసిన్, గ్లెనీగల్స్ అవేర్ హాస్పిటల్, ఎల్.బి. నగర్, హైదరాబాద్). ఆ పూర్తి వివరాలు తెలుసుకుందాం. హంటావైరస్ అనేది ప్రధానంగా ఎలుకలు, ఎలుకల జాతికి చెందిన జీవుల ద్వారా మానవులకు వ్యాపిస్తుంది. ఈ వైరస్ సోకిన ఎలుకల మూత్రం, లాలాజలం లేదా మలంతో నేరుగా సంబంధం ఏర్పడినప్పుడు లేదా అవి వదిలిన గాలిని పీల్చినప్పుడు మనుషులకు ఈ ఇన్ఫెక్షన్ సోకుతుంది. హంటావైరస్ ప్రభావం శరీరంలో రెండు రకాలుగా కనిపిస్తుంది. ఒకటి ఊపిరితిత్తులపై ప్రభావం చూపే ప్రారంభ దశ వ్యాధి సోకిన మొదటి కొన్ని రోజుల్లో లక్షణాలు చాలా సామాన్యంగా ఉంటాయి తీవ్రమైన జ్వరం, చలి. కండరాల నొప్పులు (ముఖ్యంగా వెన్ను, తుంటి మరియు భుజాల భాగంలో). అలసట, తల తిరగడం. వాంతులు, కడుపు నొప్పి తీవ్రమైన దశ వ్యాధి ముదిరిన కొద్దీ, లక్షణాలు ప్రాణాంతకంగా మారుతాయి ఊపిరితిత్తుల వైఫల్యం: ఊపిరితిత్తులలో ద్రవం చేరడం వల్ల శ్వాస తీసుకోవడం చాలా కష్టమవుతుంది. దీనిని 'షాక్' స్థితిగా పరిగణిస్తారు. అవయవాల వైఫల్యం: రక్తపోటు ఒక్కసారిగా పడిపోవడం వల్ల గుండె, మూత్రపిండాలు పనిచేయడం ఆగిపోవచ్చు.

Navataram Telugu Daily Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747,
Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State
Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com